క్లుప్తంగా

కేలండర్, డైరీ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ రాజర్షిషా

సంగారెడ్డి మున్సిపాలిటీ: రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ డైరీ, కేలండర్‌ను గురువారం అదనపు కలెక్టర్ రాజర్షి షా, డీఆర్‌డీఓ శ్రీనివాసరావుతో కలిసి విడుదల చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సి.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి యం.నర్సారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బక్కారెడ్డి, కార్యవర్గ సభ్యులు నవాబురెడ్డి, బి.జగదీశ్వర్, కార్యవర్గ సభ్యుడు ఈశ్వరప్ప, అంజయ్య, బసవేశ్వర్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



గాంధీ విగ్రహం వద్ద మున్సిపల్ చైర్ పర్సన్ లలితా సోమిరెడ్డి, తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితా సోమిరెడ్డి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా గురువారం ఉస్మాన్‌నగర్‌లో గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఇంటితో పాటు కాలనీని శుభ్రంగా ఉంచాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా మహాత్మాగాంధీ విగ్రహాన్ని శుభ్రం చేసి పాలాభిషేకం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్ చిట్టి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు సాయం



సాయం అందజేస్తున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: చదువుకోవాలనే ఆశ ఉన్నవారిని ప్రోత్సహించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. చిట్కుల్ గ్రామం నాగర్జున కాలనీకి చెందిన భవ్యశ్రీ, పాట్నా ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చేసేందుకు ప్రోత్సాహంగా గురువారం లక్ష రూపాయల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది, ఇంటర్‌తో పాటు నీట్‌లో ఆలిండియా 198వ ర్యాంకు సాధించిన భవ్యశ్రీని ఆయన అభినందించారు. ఆర్థికంగా చదువుకోలేని వారికి సాయం అందిస్తానని మధు పేర్కొన్నారు. కార్యక్రమంలో ముత్యాలు, మల్లారెడ్డి, శ్రీనివాస్ చారీ, రాములు నాయక్, బాబు రావు, అంబలాగాన్, మధుసూదన్ రావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఈఓ మల్లేశం

రాయికోడ్(అందోల్): మండలంలోని ముస్తఫపూర్ గ్రామంలో రైతు జైపాల్‌రెడ్డి సాగు చేసిన పత్తి పంటను వ్యవసాయ విస్తీర్ణాధికారి మల్లేశం గురువారం పరిశీలించారు. పత్తి పంట ఎదుగుదలకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మోతాదుకు మించి ఎరువులు, మందులను వినియోగించవద్దని, సమయానుకూలంగా పంట సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో ప్రయోగాత్మకంగా పత్తిని రెండో పంటగా సాగు చేశారని, వచ్చే ఏడాది విస్తీర్ణం పెరగనుందని పేర్కొన్నారు.

బీరప్ప జాతరను ఘనంగా నిర్వహిస్తాం

జోగిపేట(అందోల్): పట్టణంలోని మల్లికార్జున స్వామి, బీరప్ప స్వామి జాతర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కురుమ సంఘం గౌరవ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య తెలిపారు. గురువారం ఆలయం వద్ద సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆలయ ప్రహరీ, మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులపై చర్చించారు. సట్టి ఉత్సవాలతో పాటు బీరప్ప జాతర నిర్వహణపై నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జాతర ఏర్పాట్లకు సంబంధించిన నూతన కమిటీని ప్రకటించారు. ఏప్రిల్ 30 లేదా మే నెల మొదటి వారంలో జాతర నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు మాసాగోని మల్లయ్య, గొర్లకాడి వెంకటేశం, మల్లేశం, మల్లయ్య, లక్ష్మణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

కోహీర్(జహీరాబాద్): సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్‌ఎస్ నిరుపేద ప్రజలకు అండగా నిలుస్తోందని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. గురువారం పట్టణంలోని రైతువేదికలో 121 మంది లబ్ధిదారులకు రూ.1,21,14,036 విలువగల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోహీర్ రైల్వేగేటు నుంచి వయా ఖానాపూర్, బండంపేట రోడ్డు మరమ్మతులకు రూ.30 లక్షలు మంజూరు చేశామన్నారు. పోతిరెడ్డిపల్లి, కల్వర్టు నిర్మాణానికి నిధులు ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింలు యాదవ్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బంటు రామకృష్ణ, వైస్ ఎంపీపీ షాకీర్ అలీ, పీఏసీఎస్ చైర్మన్ స్రవంతిరెడ్డి, ఎంపీటీసీ అబెదా తలాత్, సర్పంచులు నర్సయ్య, రవికిరణ్, రాజశేఖర్, సంగారెడ్డి, రమేష్, పట్టణ అధ్యక్షుడు ఇఫ్తెకార్, సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, కలీమ్, జావేద్, వహీద్, సందీప్‌కుమార్, వాజీద్, సొవుద్, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

గుండెపోటుతో మృతిచెందిన మండలంలోని పీచేర్యాగడి మాజీ ఎంపీటీసీ జఠయ్య(65) కుటుంబాన్ని ఎమ్మెల్యే మాణిక్‌రావు ఓదార్చారు. గురువారం మధ్యాహ్నం గ్రామానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యేతో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు రామకృష్ణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు నర్సింహులు యాదవ్, సర్పంచు రవికిరణ్, నాయకులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ మండలం ముంగి గ్రామానికి చెందిన సంతోష్ ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. చికిత్స కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.49,500 చెక్కును గురువారం ఎమ్మెల్యే మాణిక్‌రావు అందజేశారు. బీఆర్‌ఎస్ మాజీ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, మిర్జాపూర్(ఎన్) సర్పంచ్ మల్‌రెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జహీరాబాద్: తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ అండ్ ఇండియన్ జర్నలిస్టు యూనియన్(ఐజేయు) ద్వితీయ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను గురువారం ఎమ్మెల్యే మాణిక్‌రావు క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మొహియొద్దీన్, యూనియన్ నాయకులు యోగానందరెడ్డి, శ్రీధర్‌గౌడ్, యాదగిరిగౌడ్, పరశురాం, వేణు, ధారాసింగ్, సునీల్‌కుమార్, ఎర్రల్ శ్రీనివాస్‌రెడ్డి, మజ్జిగ కిరణ్, ఆయూబ్, దౌలయ్య, హన్మంతు, రాచన్న, తుల్జరాం కరీం, హరికృష్ణ పాల్గొన్నారు.

నిరుపేదలకు సీఎం సహాయనిధి వరం



చెక్కును అందజేస్తున్న చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరంగా మారిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. 8వ వార్డు రాఘవేంద్రనగర్‌కు చెందిన బస్వరాజ్ మంజూరైన రూ.60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గురువారం అందజేశారు. మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నవీన్‌కుమార్, పెద్దాపూర్ సర్పంచ్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ్ల వీరేశం, మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, నసీర్, ముబీన్, మోహియోద్దిన్, సామేల్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ కేలండర్ ఆవిష్కరణ

పీఆర్టీయూ 2023 కేలండర్‌ను గురువారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ ఆవిష్కరించారు. సదాశివపేట పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు రంగనాయకమ్మతో కలిసి ప్రారంభించారు. అశోక్, మహమ్మద్ ఇలియాజ్, జాకీర్, గోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ్ల వీరేశం, మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, పెద్దాపూర్, గొల్లగూడెం సర్పంచులు శ్రీనివాస్, నవీన్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు అనిల్‌రెడ్డి, నసీర్, మల్లేశంయాదవ్ పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ మహిపాల్‌రెడ్డి



నారాయణఖేడ్: సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు

సీసీ రోడ్లతో మహర్దశ

కల్హేర్(నారాయణఖేడ్): సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ వస్తుందని సిర్గాపూర్ ఎంపీపీ జె.మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వాసర్ సూర్యనాయక్ తండా పంచాయతీలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కృషితో అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భారతి రామారావు, రాజు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో రూ.5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, సబ్ ఇంజనీర్ భాస్కర్ పరిశీలించారు. వార్డులో తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న కార్పొరేటర్ సింధు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇందిరా గాంధీ మహిళా మండలి ఆధ్వర్యంలో భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీలో గురువారం ముగ్గుల పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వెన్నవరం సింధు పాల్గొని విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఇందిరాగాంధీ మహిళా మండలి అధ్యక్షురాలు జ్యోతి, మాజీ కౌన్సిలర్ నాగమణి, కాలనీవాసులు శ్రీలత, సంధ్య, లక్ష్మీ, రాధా, అనిత, మంజుల పాల్గొన్నారు.

మంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన



నిర్వాహకులతో మాట్లాడుతున్న అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని బిడెకన్నె గ్రామం అరణ్య ఫార్మాకల్చర్ సంస్థ సందర్శనకు నేడు మంత్రి హరీశ్ రావు రానున్నారని జహీరాబాద్ ఆర్డీఓ రమేష్‌బాబు, డీఎస్పీ రఘు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై అరణ్య నిర్వాహకులతో వారు మాట్లాడారు. జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశ్, తహసిల్దార్ శ్రీనివాస్ పంచాయతి కార్యదర్శి శివశంకర్‌లు ఉన్నారు. తున్న ఆర్డీఓ, తహసీల్దార్ తదితరులు

బాలల హక్కులపై అవగాహన

సంగారెడ్డి టౌన్: బాలలు తమ హక్కులు, విధులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. గురువారం సంగారెడ్డిలోని సాహితీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బాలల హక్కులపై విద్యార్థులకు వివరించారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఖేడ్ ఎంపీడీఓగా వెంకటేశ్వర్‌రెడ్డి



వెంకటేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

నారాయణఖేడ్: మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి ఖేడ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా గురువారం ఎంపీపీ చాందీబాయి, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామేష్ చౌహాన్, కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయనను శాలువాలతో సన్మానించారు.

హరితహారానికి మొక్కలను సిద్ధంగా చేయండి



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఝరాసంగం(జహీరాబాద్): హరితహారంలో నాటేందుకు అవసరమయ్యే మొక్కలను సిద్ధంగా ఉంచాలని ఎంపీడీఓ సుజాత కార్యదర్శులకు సూచించారు. ఝరాసంగం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమీక్ష సమావేం నిర్వహించారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలని సూచించారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, ఉపాధి హామీ కూలీల ఆధార్‌ను సంధానం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఉపాధిహామీ ఏపీఓ రాజ్‌కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఏర్పాటులో జర్నలిస్టుల పాత్ర మరులేనిది

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: రాష్ట్ర ఏర్పాటులో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. టీయూడబ్ల్యూజే రెండో రాష్ట్ర మహాసభలు, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ 10వ ప్లీనరీ మహాసభల ఆహ్వాన పత్రికను గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర, జాతీయ మహాసభలకు పటాన్‌చెరు వేదికగా నిలవడం సంతోషకరమన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ రూ.100 కోట్లతో జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, టీఎస్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్మాయిల్, యోగానంద్, విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా, నియోజకవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

డైరీ, కేలండర్..

పటాన్‌చెరు టౌన్: టీపీటీయూ ఉపాధ్యాయ సంఘ డైరీ, కేలండర్‌ను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్, రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వేణుగోపాలస్వామి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రావు తెలిపారు.

రైతు బీమా అందజేత



లబ్ధిదారుడికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): రైతు సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. సిర్గాపూర్ మండలం వాసర్‌కు చెందిన ఇందిరాబాయి ఇటీవలే మరణించగా, మంజూరైన రైతు బీమా చెక్కును మృతుడి కుమారుడు విఠల్‌రావుకు గురువారం అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దేవేందర్, నాయకులు గుర్రపు జలంధర్, గుర్రపు జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నారాయణఖేడ్: జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఈనెల 8, 9, 10వ తేదీల్లో పటాన్‌చెరులో నిర్వహించనున్న టీయూడబ్ల్యూజే రాష్ట్ర రెండో మహాసభల వాల్‌పోస్టర్లను గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ నేతలు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా జనరల్ సెక్రెటరీ యాదగిరి గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీధర్, నాయకులు దారాసింగ్, పరశురాం, యోగానంద్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సునీల్, దిలీప్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు అమృత్, ప్రధాన కార్యదర్శి మదుసూధన్‌రెడ్డి, శ్రీకాంత్, పరమేశ్, శివకుమార్, సంజీవ్, భూమయ్య, పండరిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్, వాజీద్, రమేష్, చోటు, దత్తు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై రెవెన్యూ సదస్సు



మాట్లాడుతున్న ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్

నారాయణఖేడ్: నిజాంపేట్ మండలం నాగ్‌ధర్ గ్రామంలో గురువారం ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. పేరు, ఇంటిపేరు, కులం, ఫొటో మిస్సింగ్ తదితర సమస్యలను గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సవరణల కోసం అవకాశం కల్పించాలని, మీసేవలో మార్పులు చేర్పులు చేయించుకోవాలని కోరారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ మదన్, ఆర్ఐ శ్యాంరావు పటేల్, సర్పంచ్ రావిల మధుకర్ ఉన్నారు.

ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్ డిమాండ్ చేశారు. గురువారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి వెలిమెల మోడల్ స్కూల్‌లో యూనియన్ కేలండర్ ఆవిష్కరించారు. పదోన్నతితో కూడిన బదిలీలు, ప్రమోషన్లు వెంటనే అమలు చేయాలని కోరారు. పీఆర్సీ కమిటీని వేసి, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా భుజంగరావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, నాయకులు రాజ్ రెడ్డి, మండల అధ్యక్షుడు విజయకుమార్, ప్రధాన కార్యదర్శి పండరి, మమత, సరియా నాయక్, ఉషశ్రీ, పుష్పలత, అనిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



సమస్యలు తెలుసుకుంటున్న జీవన్‌కుమార్

నారాయణఖేడ్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఖేడ్ నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడు అలిగే జీవన్‌కుమార్ కోరారు. రెండు రోజుల క్రితం ఖేడ్ మైనార్టీ గురుకులంలో ఏడో తరగతి చదువుతున్న నవీన్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరాడు. విషయం తెలుసుకున్న జీవన్‌కుమార్ గురువారం గురుకులాన్ని సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకొని, విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్ ఖాదర్‌ను కోరారు. ఆయనతో పార్టీ కార్యదర్శి శంకర్, మండల అధ్యక్షుడు తుకారాం, సాయిలు తదితరులు ఉన్నారు.

ఈటలకు స్వాగతం



స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

జహీరాబాద్ టౌన్: హైదరాబాద్ నుంచి కర్ణాటకకు వెళుతున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు హుగ్గెల్లి చౌరస్తాలో బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. సంతోష్, విశ్వనాథ్, బాల్‌రాజ్, మల్లేశం, వంశీ, సూర్య, దుర్గేశ్, శ్రవణ్‌సింగ్, హుగ్గెల్లి ముదిరాజ్ సంఘం నాయకులు విట్టల్, రాము, నర్సింలు, మల్లన్న, బాగన్న, రాజు, సంగన్న తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **8న రక్తదాన శిబిరం**

సంగారెడ్డి టౌన్: జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో సంగారెడ్డి ఫసల్ వాది ప్రస్తార మహామేరు పంచముఖ ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 8న రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్లు విద్యాపీఠం వ్యవస్థాపకుడు డా.మహేశ్వర శర్మ సిద్ధాంతి తెలిపారు. ఉదయం 9గంటలకు గణపతి గురు ప్రార్థన, 9.30 గంటలకు సరస్వత్యర్చన, 9.45 గంటలకు రక్తదాన కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మ.1.30 గంటకు కార్యక్రమ సమాప్తి మహా హారతి ఉంటుందని, 2గంటలకు మహదాశీర్వచనం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

◆ **ఆర్థిక సాయం**

జిన్నారం(పటాన్‌చెరు): అనారోగ్యంతో మృతి చెందిన దోమడుగు గ్రామానికి చెందిన కిష్టయ్య కుటుంబానికి ఎమ్మెల్యే రూ.10వేల ఆర్థిక సాయం ప్రకటించారు. సర్పంచ్ రాజ శేఖర్ గురువారం మృతుడి కుటుంబ సభ్యులకు నగదును అందించారు.

◆ **సాయిబాబా ఆలయంలో పూజలు**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని ఇబ్రహీంబాద్ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలంకరించిన స్వామివారికి పూజలు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోడూరి రాములు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

◆ **నేటి నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు**

నారాయణఖేడ్: ఖేడ్ శ్రీరామమందిరం అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అయ్యప్ప సేవాసమితి బాధ్యులు తెలిపారు. శుక్రవారం అయ్యప్పస్వామి పల్లకిసేవ, ఊరేగింపు, శనివారం అయ్యప్పస్వామి పడిపూజ, ఆదివారం ఇరుముడి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. మూడురోజులపాటు అన్నప్రసాద వితరణ చేపట్టనున్నట్లు వివరించారు.

◆ **మాంసం దుకాణం తరలించాలి**

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణం అనుశమ్మ కాలనీలో తుల్జాభవానీమాత ఆలయం ఎదుట మాంసం దుకాణాన్ని తొలగించాలని పట్టణవాసులు కోరారు. మాంసం దుకాణంతో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులు దుకాణాన్ని వేరే చోటుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ **న్యాల్‌కల్ ఎంపీడీఓగా వెంకట్‌రెడ్డి**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల అభివృద్ధి అధికారిగా వెంకట్‌రెడ్డి నియమితులయ్యారు. కోహీర్ ఎంపీఓగా పని చేసిన వెంకట్‌రెడ్డి పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ మేరకు గురువారం బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు రేజింతల్ శ్రీసిద్ధివినాయకుడిని దర్శించుకున్నారు.

◆ **సిర్గాపూర్ వైద్యుడిగా విజయ్‌కుమార్**

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ పీహెచ్‌సీ వైద్యుడిగా విజయ్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గురువారం విధుల్లో చేరిన ఆయనకు ఆస్పత్రి సిబ్బంది రాంచెందర్, తదితరులు స్వాగతం పలికారు.

◆ **పత్తికి మద్దతు ధర ఇవ్వాలి**

మునిపల్లి(అందోల్): క్వింటాల్ పత్తికి రూ.16,500 మద్దతు ధర ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ మండల ప్రచార కార్యదర్శి దర్శి సంగమేశ్వర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని తాటిపల్లిలో ఆయన మాట్లాడుతూ పత్తికి మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని, పత్తి సాగుకు పెట్టుబడి రాని పరిస్థితి ఉందని అన్నారు. రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధర ప్రకటించాలని కోరారు.

◆ **కేలండర్ ఆవిష్కరణ**

హత్నూర (సంగారెడ్డి): ఆల్ ఇండియా సమత సైనిక్ దల్ రాష్ట్ర కమిటీ నూతన కేలండర్‌ను గురువారం సామాజిక వాదులు దౌల్తాబాద్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సామాజిక వాదులు కిషన్ రావు, ఎంఎ హకీమ్, కే.నర్సింలు, రియాజ్ అలీ ఎమ్.కృష్ణ, ఎస్.కృష్ణ, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **ఈనెల 10న సర్వసభ్య సమావేశం**

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 10న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరవుతారని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయాశాఖల అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు.

◆ **పకడ్బందీగా పంట వివరాల నమోదు**

రాయికోడ్(అందోల్): యాసంగిలో మండలంలో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేసుకోవాలని ఏఓ అభినాష్ వర్మ, ఏఈఓ యాదయ్య తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించి రైతుల వివరాలు, ఏ పంటలు సాగు చేస్తున్నారనే వివరాలను నమోదే చేసుకున్నారు. యాసంగిలో సాగుచేసే శనగ, జొన్న, గోధుమ, తదితర పంటల వివరాలను వ్యవసాయ ధికారుల వద్ద సాగు చేస్తుకోవాలన్నారు. తద్వారా రైతులు పంట ఉత్పత్తుల విక్రయ సమయంలో ఇబ్బందులు లేకుండా ఉంటాయన్నారు.

◆ **మెరుగైన సేవలు అందిస్తా**

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందిస్తానని మండల వైద్యాధికారి డాక్టర్ రమ్య పేర్కొన్నారు. మండల వైద్యాధికారి బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరు శ్రద్ధ వహించాలని ప్రజలకు సూచించారు.

◆ **మండల వైద్యాధికారిగా నవీన్‌కుమార్**

కోహీర్(జహీరాబాద్): కోహీర్ మండల వైద్యాధికారిగా డాక్టర్ నవీన్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కంది ఆస్పత్రిలో వైద్యాధికారిగా విధులు నిర్వహించిన ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు.

◆ **పాఠశాలకు ప్రొజెక్టర్ బహూకరణ**

వట్‌పల్లి(అందోల్): మండలంలోని కేరూర్ ప్రభుత్వ పాఠశాలకు ప్రొజెక్టర్‌ను అందించారు. గ్రామానికి చెందిన వీరన్న కుమారుడి పుట్టినరోజు సందర్భంగా ప్రొజెక్టర్‌ను విరాళంగా అందించినట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు బోధించేందుకు దీనిని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనంతరాంగౌడ్, ఎస్‌ఎంసీ చైర్మన్ ప్రేమ్‌కుమార్, ఉప సర్పంచ్ కుమార్, టీచర్లు శ్రావణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

◆ **అంతర్ జిల్లా క్రీడలు షురూ**

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని రంజోల్ సంగమేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అంతర్ జిల్లా క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. సాంకేతిక విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జేడీ) ఏ.పుల్లయ్య, మహీంద్ర కర్మాగారం మేనేజర్ సుధాకర్, ప్రిన్సిపాల్ కుమారస్వామి పోటీలను ప్రారంభించారు. పోటీలకు సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లా ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 21 క్రీడాంశాల్లో 260 మంది బాలురు, 180 మంది బాలికలు హాజరయ్యారు.